లక్ష్యం.. 'లక్ష'ణమైన పచ్చదనం

- ఖైరతాబాద్‌లో 2.50 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- వర్షాలు కురుస్తుండడంతో దృష్టి సారించిన అధికారులు
- నర్సరీలో పంపిణీకి రెడీగా మొక్కలు

బంజారాహిల్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో వన మహోత్సవానికి ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం నగరంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. వన మహోత్సవంలో భాగంగా అధికారులు మొక్కలు నాటడంపై దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేటా జూలైలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా జూలై మొదటివారంలో సీఎం రేవంత్‌రెడ్డి రాజేంద్రనగర్‌లో వన మహోత్సవ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్‌లో వన మహోత్సవ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ అర్బన్ బయో డైవర్సిటీస్ (యూబీడీ) అధికారులు సిద్ధమయ్యారు. మొక్కలు నాటే ప్రాంతాలను ఎంపిక చేసి ఆయా ప్రాంతాల్లో వన మహోత్సవ కార్యక్రమాన్ని పండగలా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు నర్సరీలో మొక్కలురెడీగా ఉన్నాయి.

టార్గెట్ 2.5లక్షల మొక్కలు..

వన మహోత్సవం 2025లో భాగంగా ఖైరతాబాద్ జోన్‌లో భాగంగా జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలో ఐదు సర్కిళ్లు ఉండగా మొత్తం 2.50లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో పెద్దవి, చిన్నవి కలిపి ఆయా ప్రాంతాల విస్తీర్ణానికి అనుగుణంగా నాటాలని నిర్ణయించారు. రహదారుల పక్కన, చెరువులు, కుంటలను అనుకుని ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వన మహోత్సవం-2025కు నర్సరీల్లో మొక్కలు ఇప్పటికే అందుబాటులో ఉంచారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలో 62,500, జూబ్లీహిల్స్ జోన్ పరిధిలో 62,500, మెహదీపట్నంలో 62,500, కార్వాన్, గోషామహల్ 31,500 మొక్కలు నాటాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. ఆయా జోన్‌లలో 40 వేల పొడవైన మొక్కలు, మిగతావి చిన్న మొక్కలను నాటనున్నారు. కాగా ఇప్పటికే సుమారు 50 వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు.



వన మహోత్సవానికి నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం..

వన మహోత్సవం 2025ను విజయవంతం చేయడానికి అధికారులు ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయనున్నారు. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, బస్తీ, కాలనీ సంఘాల సభ్యులను భాగస్వాములను చేయాలని యోచిస్తున్నారు. అలాగే మొక్కలు నాటిన వెంటనే వాటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ఇంటికి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు.



నర్సరీల్లో మొక్కలు సిద్ధం

వన మహోత్సవాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. రెండున్నర లక్షల మొక్కల పెంపకం లక్ష్యమైనప్పటికీ చాచా నెహ్రూ పార్కు, విజయ నర్సరీ, ఇందిరాపార్కుతో పాటు వివిధ ప్రాంతాల్లో మొత్తం 4.29 లక్షల పెద్ద మొక్కలు, 2 లక్షల ఆర్నమెంటల్ ప్లాంట్స్ సిద్ధంగా ఉన్నాయి. ప్రణాళిక ప్రకారం గుర్తించిన ప్రాంతాల్లో వీటిని నాటుతాం. అలాగే నివాసితులకు తమ ఇళ్ల అవరణలో పెంచుకోవడానికి 20 వేలకు పైగా మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తాం. అందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాం.

- బాలయ్య, యూబీడీ అధికారి, జీహెచ్‌ఎంసీ సర్కిల్-18



ప్రేమ్‌నగర్‌లో మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న డీఎంసీ సమ్మయ్య

రహదారులపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

- జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 డీఎంసీ సమ్మయ్య

పంజాగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రహదారులపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 డీఎంసీ సమ్మయ్య హెచ్చరించారు. వర్షాకాల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం బంజారాహిల్స్ డివిజన్ ప్రేమనగర్‌లో పర్యటించారు. పారిశుధ్యం, కాలనీ సమస్యలపై బస్తీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ప్రేమనగర్‌లోని నాలా ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను, సాయిబాబా కమాన్ వద్ద ఉన్న మట్టి కుప్పలను సిబ్బంది తొలగించారు. కాలనీకి రెండు కొత్త రిక్షాలు కేటాయించాలని స్థానికులు కోరారు. సమస్యలపై త్వరలో జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మిని కలవనున్నట్టు బస్తీ ప్రధాన కార్యదర్శి భగవాన్‌దాస్ తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ 18 ప్రాజెక్ట్ అధికారి ఆశా, ఈఈ నాగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



నగర అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్‌మాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి తదితరులు

ఆలయాన్ని దర్శించుకుంటే అక్రమ కేసులా?

- పోలీసుల తీరును ఖండించిన బీజేపీ

బంజారాహిల్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కూల్చివేసిన ఆలయాన్ని దర్శించుకుంటే అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీజేపీ, విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు ఆరోపించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ దేవాలయం కూల్చివేతలో నిరసన వ్యక్తం చేసిన నాయకులపై క్రిమినల్ కేసులు పెట్టడాన్ని తప్పుపడుతూ నాయకులు నగర అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్‌మాన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ఆలయం కూల్చివేత అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు వెళ్లారని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరూ వ్యవహరించలేదని, అయినా పోలీసులు కావాలని వారిపై కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు. వెంటనే అక్రమ కేసులను ఎత్తేయాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు ఉన్నారు.



మీనాక్షి నటరాజన్, మహేష్‌కుమార్‌గౌడ్‌కు పూలబొకే అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్

సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ఎజెండా

- పార్టీ నాయకుడు నవీన్‌యాదవ్

బంజారాహిల్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ఎజెండా అని పార్టీ నాయకుడు నవీన్ యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా పరిగిలో గురువారం ప్రారంభమైన జనహిత పాదయాత్రకు మద్దతుగా నవీన్‌యాదవ్ అక్కడకు వెళ్లి మీనాక్షి నటరాజన్, మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా ఎదిగిందని, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రారంభించిన జనహిత పాదయాత్ర జయప్రదం కావాలని నవీన్ ఆకాంక్షించారు.



నవీన్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళ్లద్దాల పంపిణీ

బోరబండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో రహ్మత్‌నగర్ డివిజన్ నవీన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 60 మందికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. వెస్ట్ మారేడ్ పల్లిలోని పుష్పగిరి ఐ ఫౌండేషన్ సహకారంతో జూలై 1న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి అద్దాలు అవసరమైన వారికి గురువారం అందించినట్టు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు కల్యాణ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని ఆయన సూచించారు. సర్వీస్ డైరెక్టర్ చక్రవర్తి రెడ్డి, సభ్యుడు వెంకట్‌రెడ్డి, అంగన్వాడీ టీచర్ మేరీ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి



మాదాపూర్‌లోని మైండ్ స్పేస్ నుంచి వచ్చే రహదారిలో కేబుల్స్ నిర్వహణ పేరుతో రోడ్డును అధికారులు తవ్వి వదిలేశారు. దీంతో ఆ రహదారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

- హైటెక్ సిటీ, ఆంధ్రజ్యోతి

బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బోరబండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పేదలు అధికంగా నివసించే బస్తీల్లో కనీస వసతుల కల్పనకు కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్ ఆటోస్టాండ్ వద్ద రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న వాననీటి కాలువ పనులకు కార్పొరేటర్ సీఎన్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వాననీటి కాల్వ నిర్మాణం పూర్తయితే స్థానికులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం అవుతుందని ఆయన పేర్కొన్నారు. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం చేపడతామని ఆయన హామీనిచ్చారు. అనంతరం బోరబండ డివిజన్‌లోని రాజ్‌నగర్, బంజరానగర్, స్వరాజ్‌నగర్ బస్తీలలో రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ ఎండీ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి మంత్రి వివేక్‌వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. అలాగే, రాజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కార్మికనగర్‌లో వాననీటి కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

స్థానిక ఎన్నికల్లో భారత చైతన్య యోజన పోటీ

- పార్టీ అధినేత రామచంద్రయాదవ్

బంజారాహిల్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత చైతన్య యోజన పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ అన్నారు. బంజారాహిల్స్‌లో గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయ వ్యవస్థగా భారత చైతన్య యోజన పార్టీ రూపాంతరం చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు లక్ష్యాలను నాటి బీఆర్‌ఎస్, నేటి కాంగ్రెస్ మరిచాయని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కంటే అవినీతి చేయడంపై శ్రద్ధ పెట్టాయని ఆరోపించారు. బీసీలను అడ్డం పెట్టుకుని అన్ని పార్టీలు పబ్బం గడుపుతున్నాయని ఆయన ఆరోపించారు. బీసీల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు లేదన్నారు. నిరుద్యోగులకు న్యాయం చేయడమే ప్రధాన ఏజెండాగా పని చేస్తామన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు రామచంద్రయాదవ్ వెల్లడించారు.

ఆర్టీఐ కమిషనర్‌ను కలిసిన కేశవులు

హైదరాబాద్ సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం రాష్ట్ర చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని గురువారం సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మెరబోయిన కేశవులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలోని ఆయన కార్యాలయంలో పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సమితి సభ్యుడు మేకల శ్రీహరి, తదితరులు ఉన్నారు.

దారి దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

బంజారాహిల్స్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు దుండగులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. షేక్‌పేట వినోబానగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ పండ్ల దుకాణం నిర్వహిస్తుంటాడు. ఈ నెల 28న రాత్రి 11.30గంటల ప్రాంతంలో షాపు మూసిన తర్వాత తన బంధువు బాలరాజుతో కలిసి భోజనం చేసేందుకు సమీపంలోని హోటల్‌కు వెళ్లాడు. డిన్నర్ ముగించుకుని అర్ధరాత్రి 12.30 ప్రాంతంలో ఇంటికి బయలుదేరారు. ద్వారకానగర్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి ఓ ఆటోవచ్చి ఆగింది. ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు శ్రీనివాస్‌ను అటకాయించడంతో పాటు బలవంతంగా లోనికి లాగారు. శ్రీనివాస్‌తో వచ్చిన బాలరాజు అక్కడ నుంచి పారిపోయాడు. ఆటోలో కూర్చున్న వ్యక్తులు అతడి జేబులోంచి పర్సును లాక్కుని బయటకు తోసేశారు. పర్సులో రూ.6వేల నగదుతో పాటు ఏటీఎం, పాన్‌కార్డు, ఆధార్ కార్డు ఉన్నాయని బాధితుడు శ్రీనివాస్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ పరిశీలించి నిందితులు నగేష్‌రాథోడ్, రాథోడ్ వెంకటేష్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్ సర్కారుకు సంపూర్ణ మద్దతు


- ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, విద్యావంతుల ఐక్యవేదిక

పంజాగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమే లక్ష్యంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, విద్యావంతుల ఐక్య వేదిక నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ జేఏసీ నాయకుడు, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, బీసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు మాట్లాడారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు న్యాయం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆగస్టు 5, 6, 7 తేదీలలో జరగనున్న నిరసన కార్యక్రమాల్లో తాము సైతం పాల్గొంటామని వారు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్‌ను వెంటనే నెరవేర్చాలని వారు కోరారు. ఈ సమావేశంలో వేదిక నాయకులు హేమచంద్రుడు, రాములుముదిరాజ్, కోల జనార్దన్, మహేశ్వర్‌రావు, శివ ముదిరాజ్, మహేష్‌గౌడ్, ప్రశాంత్, నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ జేఏసీ నాయకుడు సైదులు






టీజీఎస్‌పీడీసీఎల్ సివిల్ ఎస్‌ఈగా పని చేస్తూ గురువారం పదవీ విరమణ చేసిన శ్రీనివాస్ దంపతులను సీఎండీ ముషారఫ్ ఫారూకీ సన్మానించారు. ఎస్‌ఈగా దీర్ఘకాలం సేవలందించిన శ్రీనివాసరావు టీజీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంతో పాటు ఇతర భవనాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారని ఆయన కితాబిచ్చారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

కారులో వచ్చి.. చైన్ స్నాచింగ్

హైదర్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాల ప్యాకెట్ కోసం షాపునకు వెళ్తున్న వృద్ధురాలిని కారులో వచ్చిన వ్యక్తులు అడ్రస్ అడుగుతున్నట్లు నటించి ఆమె మెడలో నుంచి చైన్ లాక్కెళ్లారు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-3లో భువన విజయం గ్రౌండ్ సమీపంలోని ఎంఐజీ 664లో నివాసం ఉండే చిత శ్యామల గురువారం ఉదయం 6.30గంటలకు పాల ప్యాకెట్ తెచ్చేందుకు షాప్‌కు వెళ్తుంది. వెనుక నుంచి కారులో వచ్చిన వ్యక్తులు ఆమెను హిందీలో అడ్రస్ అడగగా ఆమె తెలియదని చెప్పారు. ఓ వ్యక్తి కారు దిగి ఆమె వద్దకి వెళ్లి పేపర్ చూపిస్తూ అడ్రస్ అడిగినట్లు నటిస్తూ మెడలోని చైన్ లాక్కోబోయాడు. ఆమె ప్రతిఘటించడంతో చైన్‌లో కొంతభాగం ఆమె చేతిలో ఉండిపోగా మిగతా భాగాన్ని తీసుకుని దుండగుడు కారులో పరారయ్యాడు. బాధితురాలు వెంటనే కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన 5తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



శ్యామల

అభివృద్ధి పనులకు మోక్షం కలిగేనా?

- బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌లో తాగునీటికి కటకట
- చిన్నపాటి వర్షానికే పార్కింగ్ బురదమయం
- మూలనపడిన వే-బ్రిడ్జి
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ


బోయినపల్లి మార్కెట్ ముఖద్వారం


లారీలు పార్క్ చేసిన స్థలం

సికింద్రాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రసిద్ధి చెందిన బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు ముందుకు పడేనా? పాతికేళ్ల చరిత్ర కలిగిన ఈ మార్కెట్‌లో కనీస సదుపాయాలు మరింత మెరుగు పడేనా? రైతులు, హమాలీలు, కమీషన్ ఏజంట్లు, కొనుగోలుదారులకు మంచినీటి వసతి, టాయిలెట్లు, రోడ్లు తదితర వసతులు అందుబాటులోకి వచ్చేనా? రాష్ట్ర రైతు కమిషన్ ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో మార్కెట్‌లో వసతుల మెరుగు, అభివృద్ధి శీఘ్రగతిన ప్రారంభం కావచ్చన్న ఆశలు చిగురిస్తున్నాయి. మార్కెట్ కమిటీ కొద్ది నెలల క్రితం చేసిన ప్రతిపాదనలన్నీ త్వరలోనే కార్యరూపం దాల్చవచ్చని, దీనికి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ పచ్చజెండా ఊపుతుందన్న నమ్మకం మార్కెట్ కమిటీకి, అధికారులకు కలుగుతోంది.


మూలన పడిన వే-బ్రిడ్జి

- సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో రోజురోజుకూ రద్దీ పెరుగుతుండడం, ఇతరత్రా కారణాల వల్ల బోయినపల్లి డైమండ్ పాయింట్-తిరుమలగిరి మార్గంలోకి ఈ మార్కెట్‌ను తరలించారు. 23 ఎకరాల విస్తీర్ణంలో పాతికేళ్ల క్రితం మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. మోండా మార్కెట్‌లోని పలు హోల్‌సేల్ దుకాణాలను ఇక్కడికి తరలించారు. అయితే ఇప్పటికీ కొన్ని దుకాణాలు మోండా మార్కెట్‌లోనే కొనసాగుతున్నాయి. కాగా బోయినపల్లి మార్కెట్‌లో రైతులు, హమాలీలు, కమీషన్ ఏజంట్లు, కొనుగోలుదారులకు తగిన సదుపాయాలు కల్పించడంలో మార్కెటింగ్ శాఖ విఫలమవుతూ వస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల నుంచి ఇక్కడికి అనేకరకాల ఉత్పత్తులు దిగుమతి అవుతుంటాయి. అయితే ఇప్పటి వరకూ ఈ మార్కెట్‌లో తాగునీటి సదుపాయం సక్రమంగా లేకపోవడం గమనార్హం. దీంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఇక్కడ అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వే-బ్రిడ్జి మూలన పడి ఏడాదిన్నర దాటింది. ముఖ్యంగా చిన్నపాటి వర్షాలకే పార్కింగ్ స్థలం బురదమయంగా మారడం, గుంతలమయమైన ఈ ప్రాంతంలో ఏ క్షణంలో ఏ లారీ మొరాయిస్తుందో తెలియని దుస్థితి నెలకొని ఉంది. వీటన్నింటికీ చెక్ పెట్టి, తగిన అభివృద్ధి పనులు చేపట్టడంపై అధికార యంత్రాంగం పెద్దగా దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


మార్కెట్‌లోని టాయిలెట్లు

- కాగా రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలో ఇటీవల కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు ఈ మార్కెట్‌లో ఆకస్మిక పర్యటన చేసి, క్షేత్రస్థాయిలో అన్ని అంశాలు పరిశీలించారు. అనంతరం స్థానిక సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్, బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ప్రభుకుమార్‌గౌడ్ తదితర సభ్యులు కోదండరెడ్డితో ప్రత్యేకంగా సమావేశమై, మార్కెట్ అభివృద్ధికి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. దీనికి కోదండరెడ్డి, ఇతర సభ్యులు సానుకూలంగా స్పందించడంతో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడగలవని, అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్న ఆశలు చిగురిస్తున్నాయి.


మార్కెట్‌లోని అంతర్గత రోడ్లు

త్వరలోనే మోక్షం



మార్కెట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు తదితరుల దృష్టికి కూడా తీసుకువెళ్లాం. వారందరి సహకారంతో ఈ ప్రతిపాదనలకు త్వరలోనే మోక్షం కలగనుంది. ఇటీవల మా మార్కెట్‌లో పర్యటించిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఇతర సభ్యులు కూడా మార్కెట్ అభివృద్ధి విషయమై శ్రద్ధ తీసుకుంటున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ద్వారా మార్కెట్‌కు నేరుగా మంచినీటి పైప్‌లైన్ వేసే ప్రక్రియ కూడా సాగుతోంది.

- రాగీరు ఆనంద్‌బాబు, మార్కెట్ చైర్మన్


రేషన్‌కార్డుల పంపిణీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీగణేష్

నేడు కంటోన్మెంట్‌లో రేషన్‌కార్డుల పంపిణీ

సికింద్రాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బాలంరాయిలోని లీప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్టు, రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని స్థానిక కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఉదయం 10 నుంచి కార్డుల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం లీప్యాలెస్ ఫంక్షన్ హాలును ఆయన సందర్శించి, ఏర్పాట్లు పరిశీలించారు. పంపిణీ సందర్భంగా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంగన్‌వాడీని పునరుద్ధరించాలి

తిరుమలగిరి జూలై 31 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మందాబాద్‌లో కొన్ని సంవత్సరాలుగా మూసివేసిన అంగన్‌వాడీని వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవీ బాల్‌రాజ్ అన్నారు. గురువారం ముందబాద్‌లోని అంగన్‌వాడీనిని పరిశీలించారు. ఒక్కో వార్డులో సుమారు నాలుగు నుంచి ఐదు వరకు అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయని, కానీ బొల్లారం వార్డు-8లో ఒక్కటే ఉందని దానిని కూడా అధికారులు మూసి వేయడం బాధకరం అన్నారు. అధికారులు స్పందించి సెంటర్‌ను పునరుద్ధరించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేందర్, రాజు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఓయూ విద్యార్థినికి డాక్టరేట్


ఓయూ విద్యార్థిని వాణికి డాక్టరేట్ పట్టా అందజేస్తున్న ప్రొఫెసర్ శ్రీరాములు

అడ్డగుట్ట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థిని వాణి ఓయూ ప్రొఫెసర్ శ్రీరాములు చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ ఓయూలో వాణిజ్యం వ్యాపారం నిర్వహణ విభాగం నుంచి బ్యాంకింగ్ రంగంలో మహిళల ఒత్తిడికి కారణాలు ఏవిధంగా అధిగమించగలరనే అంశంపై పీహెచ్‌డి పూర్తిచేసుకున్న సందర్భంగా డాక్టరేట్ అవార్డు అందుకున్నాని తెలిపింది. ఆమె డాక్టరేట్ అందుకున్నందుకు కుటుంబ సభ్యులు, భర్త భీష్మాచారి, మామయ్య విగ్రహాల అంజయ్య చారి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

క్రైమ్ న్యూస్

గుర్తుతెలియని వ్యక్తి మృతి


అంజయ్య

బోయినపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. బోయినపల్లి ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల మేరకు సదాశివపేట్‌కు చెందిన గడీల అంజయ్య వయస్సు సుమారు (60) సోమవారం అనారోగ్యంతో బాధపడుతూ బోయినపల్లి చెక్‌పోస్ట్ సమీపంలో అపస్మారకస్థితిలో పడిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు మెరుగైన వైద్యం చేయించిన అనంతరం స్థానిక సర్కిల్ సెంటర్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆశ్రయం పొందుతూ ఆసుపత్రిలో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం మృతదేహం గాంధీ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఎవరైన గుర్తిస్తే బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి


లారెన్స్ డానియల్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ డబ్బుల కోసం బ్యాంకు వెళుతున్న సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని తీవ్ర గాయాలతో ఓ విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన లారెన్స్ డానియల్(70) ఎయిర్‌ఫోర్స్‌లోని ఆర్మీ విభాగంలో విశ్రాంతి ఉద్యోగి. గురువారం పెన్షన్ డబ్బుల కోసం లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటి మెట్టుగూడ వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు సీతాఫల్‌మండి వైపునకు వెళ్లే రైలు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో రైలు పట్టాల పక్కన పడిపోయాడు. గమనించిన స్థానికులు పక్కన పడుకోబెట్టిన కొద్దిసేపటికే ప్రాణం పోయింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేర్వేరు ప్రాంతాల్లో రైలుకింద పడి ఇద్దరి ఆత్మహత్య


మహేష్(ఫైల్)

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం నేరెడ్‌మెట్ వినాయక్‌నగర్ ప్రాంతానికి చెందిన మహేష్(43) తీవ్ర అనారోగ్యం కారణంగా గురువారం చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జేమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్ పరిధిలో..


ధనూష్(ఫైల్)

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జేమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదిలాబాద్ జిల్లా ఊట్నూర్ మండలం నాగపూర్ గ్రామానికి చెందిన ధనూష్(35) సికింద్రాబాద్ వైపునకు రైలు వస్తున్న సమయంలో ఆకస్మికంగా ఎదురుగా వచ్చి రైలుకింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని జేబులో లభించిన అడ్రస్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కంటోన్మెంట్ వార్డుల అభివృద్ధే ధ్యేయం

- భానుకా నర్మదా మల్లికార్జున్


భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న భానుకా నర్మద మల్లికార్జున్, కాలనీవాసులు

మారేడుపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు వార్డుల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుకా నర్మదా మల్లికార్జున్ అన్నారు. గురువారం బోర్డు నాలుగో వార్డ్ పరిధిలోని కృష్ణపురి కాలనీలో రూ.17 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు, బస్తీల స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించినట్లు ఆమె పేర్కొన్నారు. కాలనీవాసులు తెలిపిన సమస్యలో తాగునీటి పైప్‌లైన్ సమస్య ముఖ్యమైదని, దీనిని వెంటనే బోర్డు సమావేశంలో చర్చించి పరిష్కారం చూపుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షులు సచిన్, బీజేపీ సీనియర్ నాయకులు విజయానంద్, టోపి శంకర్, రాజ్ మల్లేష్, కాలనీ ప్రెసిడెంట్ సతీష్, రాజేందర్, భూషణ్ రెడ్డి, రేఖ భూషణ్, మంజులత, కల్మేష్, రమణా, నరేందర్, పద్మజ, తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.


హుండీల లెక్కింపు పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి

ఉజ్జయినీ మహాకాళి ఆలయ హుండీల లెక్కింపు

సికింద్రాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో బోనాల జాతర-2025 హుండీలను గురువారం లెక్కించారు. 34 రోజులకు సంబంధించిన హుండీలను లెక్కించగా నోట్ల రూపంలో రూ. 58లక్షల 84వేల 66 రూపాయలు, నాణేల రూపంలో రూ.3లక్షల 36వేల 816, అమెరికన్ డాలర్లు 320, కెనడా డాలర్లు 5(ఈ డాలర్ల మొత్తం విలువ 23వేల 618 రూపాయలు) కానుకలుగా వచ్చాయి. మొత్తం హుండీ ఆదాయం 62లక్షల 44వేల 500రూపాయలుగా అధికారులు ప్రకటించారు. కాగా 56 గ్రాముల బంగారం, 1,150 గ్రాముల వెండి కూడా అమ్మవారికి కానుకల రూపంలో వచ్చినట్టు పేర్కొన్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, మహాకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి రామేశ్వర్, బోనాల జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, బ్యాంకు అధికారులు, భక్తుల సమక్షంలో హుండీల లెక్కింపు జరిగింది.


రైల్వే డీఆర్ఎంను కలిసి ఆర్ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణంపై వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రిరాజశేఖర రెడ్డి, తదితరులు

ఆర్‌యూబీ, ఆర్ఓబీ పనులు చేపట్టాలి

- రైల్వే డీఆర్ఎంకు ఎమ్మెల్యే మర్రి వినతి

మల్కాజిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిన ఆర్ఓబీ, ఆర్‌యూబీల పనులను త్వరగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి కోరారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సికింద్రాబాద్‌లోని రైల్వే డీఆర్ఎంను కార్యాలయంలో కలిసి ఆర్‌యూబీ, ఆర్ఓబీల ఏర్పాటుపై చర్చించారు. డీఆర్ఎంతో పాటు రైల్వే చీఫ్ ఇంజనీర్ నాగభూషణంను కలిసిన ఆయన అల్వాల్ బూదేవినగర్‌లో రైల్వేస్టేషన్‌లో పాదచారుల కోసం మరో గేటు ఏర్పాటు చేయాలని, శ్రీనగర్ కాలనీలో ఐలా అనుమతి తీసుకుని డ్రైనేజీ పైప్‌లైను ఏర్పాటు చేయాలని, తాళ్లబస్తీ ఇక్రిసాట్ కాలనీలో రైల్వే కాంపౌండ్‌వాల్ నిర్మాణం చేపట్టాలని, వాజ్‌పేయ్‌నగర్, నేరేడ్‌మెట్ ఆర్‌యూబీ పనులను త్వరగా చేపట్టాలని, కోరుతూ డీఆర్ఎం, రైల్వే చీఫ్ ఇంజనీర్‌లకు వినతిపత్రం సమర్పించారు, కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జేఏసీ వెంకన్న, అనిల్‌కిశోర్‌గౌడ్, డోలి రమేష్, చిన్నా యాదవ్, ఉస్మాన్, వంశీ, రాజశేఖర రెడ్డి పాల్గొన్నారు.


రాహుల్‌ని సత్కరించి, వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

పదవీ విరమణ వీడ్కోలు

చిలకలగూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్యరైల్వే సికింద్రాబాద్‌లోని వివిధ విభాగాల్లో, హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 104 మంది గురువారం పదవీ విరమణ చేశారు. వారికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ రైల్వే కార్యాలయాలు సందడిగా మారాయి. అకౌంట్స్ విభాగంలో రాహుల్, మురళీకృష్ణ, కుమార్ తదితరులకు ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు ఢిల్లీలో బీసీఎస్ఎఫ్ నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలు కోసం 'హలో బీసీ-చలో ఢిల్లీ' కార్యక్రమంలో భాగంగా ఢిల్లీకి వెళ్లిన బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు అక్కడ తెలంగాణ భవన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ బిల్లుని ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ ద్వారా ఈ చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. చట్టసభల్లో మహిళలకు కల్పిస్తున్న 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళా కోటా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీఎస్ఎఫ్ అధ్యక్షులు కొమ్మబోయిన సైదులు యాదవ్, బీసీ సంఘం కన్వీనర్ వీరబోయిన లింగం యాదవ్, టీఎస్పీ అధ్యక్షులు బారి అశోక్ కుమార్, వీజేఎస్ ఓయూ అధ్యక్షులు కడారి రమేష్, నాయకులు సురేష్, గణేష్, వెంబడి అభి, శంకర్, సురేష్, గణేష్, పైడి, మహేష్, రాజేష్ పాల్గొన్నారు.


సిరాజ్ పటేల్‌ను సత్కరిస్తున్న సభ్యులు

ఆటో డీలర్లు, కార్మికుల హక్కుల సాధనకు కృషి

రాంగోపాల్‌పేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఆటో డీలర్లు, కార్మికుల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని గ్రేటర్ హైదరాబాద్, సికింద్రాబాద్ ఆటో డీలర్స్ & వర్కర్స్ అసోసియేషన్‌కు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సిరాజ్ పటేల్ డీలర్లకు, కార్మికులకు హామీ ఇచ్చారు. జంట నగరంలలోని ఆటో డీలర్లు, కార్మికులు గురువారం సికింద్రాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అసోసియేషన్ నూతన అధ్యక్షుడు సిరాజ్ పటేల్‌ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతూ సిరాజ్ నాయకత్వంలో ఆటో డీలర్లు, కార్మికుల సంక్షేమం తప్పకుండా జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇది అసోసియేషన్ అభివృద్ధికి, ఐఖ్యతకు ముందడుగని అభివర్ణించారు. ఈ సందర్భంగా సిరాజ్ పటేల్ మాట్లాడుతూ త్వరలోనే అసోసియేషన్ నూతన కమిటీని ప్రకటించనున్నట్లు వెల్లడించారు.


ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

క్రైస్తవుల నిరసన ర్యాలీ

రెజిమెంటల్‌బజార్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్‌లో అక్రమంగా అరెస్టు చేసిన నన్స్‌ను విడుదల చేయాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం సికింద్రాబాద్‌లో ర్యాలీ నిర్వహించి, క్యాండిల్స్ వెలిగించి నిరసన తెలిపారు. సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సెయింట్ మేరీస్ స్కూల్, అపోలో ఆస్పత్రి మీదుగా మదర్ థెరిసా విగ్రహం వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో బిషప్ ప్రిన్స్, ఫాదర్ ఇమాన్యుల్, ఫాదర్ రాజు అలెక్స్, సిస్టర్ అల్ఫోన్సా, సిస్టర్ నాన్సీ క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో కార్పొరేటర్ పర్యటన

మల్కాజిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని ఎన్ఎండీసీ కాలనీ, అనంత సరస్వతీనగర్‌లో కార్పొరేటర్ ప్రేంకుమార్ గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. సెంటర్ డ్రైనేజీ సిస్టంను కలుపాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్లను పూర్తిచేయించాలని స్థానికులు కోరారు. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకవచ్చిన కార్పొరేటర్ వెంటనే పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ దివ్యజ్యోతి, వాటర్‌వర్క్స్ మేనేజర్ తేజస్విని, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ముషీరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మలేరియా నిర్మూలనకు నిర్వహించిన ర్యాలీలో జీహెచ్ఎంసీ సర్కిల్-15 డీఎంసీ రామానుజుల రెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణలతో కలిసి కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ డివిజన్‌లోని కళాధర్‌నగర్, గంగపుత్రకాలనీ, బాపూజీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, పార్టీ నాయకులు మెట్టు వాసు, వెంకటేష్, బాలు, ప్రసాద్‌గుప్తా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సమీక్ష

మల్కాజిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాబోయే వినాయక చవితి, తదుపరి నిమజ్జన ఏర్పాట్లపై మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ గురువారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మండపాల ఏర్పాటు తర్వాత నిమజ్జనానికి తరలివెళ్లే రహదారులపై గుంతల పూడ్చివేత, నిమజ్జనం సమయంలో చెరువు వద్ద 15 రోజుల పాటు క్రేన్‌ల ఏర్పాటు, నిమజ్జన కొలను శుభ్రం చేసి కొత్తనీటిని నింపడం, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో స్వాగత వేదికలు ఏర్పాటు చేయడం, సఫిల్‌గూడ మినీట్యాంక్‌బండ్‌పై ఉన్న టాయ్‌లెట్లను శుభ్రపరుస్తూ కొత్తగా మొబైల్ టాయ్‌లెట్లను ఏర్పాటు చేయడం లాంటి వాటిపై డీఈ మహేష్, ఏఈ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులతో చర్చించారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT L.B. RAJENDRA NAGAR
O.S.NO. 250 OF 2025

Between:
Dara Dayamani, W/o Dara Rama Swamy, ...Petitioner/Plaintiff
AND
G. Koteshwar Rao, S/o Sri G Rangaiah and others ...Respondents/Defendants

Notice to,
Dara Dayamani. W/o. RamaSwamy. Aged: not known to the Plaintiff, Occ: Not known. R/o. 12-8-264/1/D. Allugadda Bai. Secunderabad - 500 061. (Defendant No.2 impersonated the Plaintiff)

Please take notice that the above-named Petitioner/Plaintiff had filed the above captioned Suit vide OS. No. 250 of 2025 before the Hon'ble Principal Senior Civil Judge Ranga Reddy At: Rajendra Nagar, for Declaration of Title and Consequential Relief of Recovery of Possession: To Declare the General Power of Attorney bearing Doc No. 7366 of 2014 Dated 06.11.2014 and Sale Deed bearing Doc No. 354 of 2015 Dated 19.01.2015 and Sale Deed bearing Doc No. 1540 of 2015 Dated 23.02.2015 and Sale Deed bearing Doc. No. 3219 of 2015 Dated 23.04.2015 as Null and Void and not binding on the Plaintiff along with I.A.No. 1175 of 2019 seeking a relief not to alienate the Petition Schedule Property and also I.A.No.1176 of 2019 seeking a relief not to change the nature of the Petition Schedule Property before the Hon'ble Principal Senior Civil Judge, Ranga Reddy District At Rajendra Nagar, against you Respondent/Defendant No. 2 and the Hon'ble Court has adjourned the above said matter to 03.09.2025 for your appearance. Please be present before the above-named court on 03.09.2025 at 10.30 AM either in person or through your advocate, failing which the matter shall be decided in your absence and based upon merits.

(BY ORDER OF COURT)
M. MURTHY MAAN, ADVOCATE